క్లుప్తంగా

నేడు సీతారాముల కల్యాణం

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరుగుతాయి. అనంతరం ఆలయంలోని శ్రీ సీతారామ, లక్ష్మణ సమేత ఆంజనేయుడి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కలిగిస్తారు. ఆ తరువాత ఉదయం 9 గంటలకు ఆలయం ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెళ్లి మండపానికి ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి శ్రీసీతారాముల కల్యాణం జరిపిస్తారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

కోదండ రాముడి సేవలో హైకోర్టు జడ్జి



స్వామివారిని దర్శించుకున్న జస్టిస్ చల్లా గుణరంజన్

చంద్రగిరి: చంద్రగిరిలో వెలసిన శ్రీకోదండరామున్ని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. స్వామివారి దర్శనానంతరం అర్చకులు వేద ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంటన అష్టవధాని మేడసాని మోహన్, ఆలయ అధికారులు ఉన్నారు.

ప్రమోషన్స్ కల్పించాలని వినతి

తిరుపతి సిటీ: వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేజేషన్ సెక్రటరీలకు సీనియారిటీ లిస్ట్ రూపొందించి ఉద్యోగోన్నతి కల్పించాలని టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జే విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులును రాష్ట్ర వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీల అసోసియేషన్ నాయకులు కోరారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డీటీసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పూర్ణచంద్ర సాయి, కోఆర్డినేటర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో కలసి వినతి పత్రం అందించారు. కార్పొరేషన్ అధ్యక్షుడు చల్లా గణేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి



అనసూయమ్మ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుచానూరు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి తల్లి అనసూయ మ్మ మృతికి చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నివాళులు అర్పించారు. శనివారం ఆయన శ్రీధర్ రెడ్డి ఇంటికి చేరుకుని అనసూయమ్మ మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ముగిసిన మూట్ కోర్టు పోటీలు



మూట్ కోర్టులో పాల్గొన్న అతిథులు, కళాశాల చైర్మన్, న్యాయవాదులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: స్థానిక డాక్టర్ అంబేడ్కర్ లా కళాశాలలో ఫైనల్ ఇయర్ ఎల్‌ఎల్‌బీ విద్యార్థులకు గత మూడు రోజులుగా కళాశాలలో జరుగుతున్న మూట్ కోర్టు పోటీలు శనివారం ముగిశాయి. ఫ్యామిలీ కోర్ట్ కమ్ అదనపు జిల్లా న్యాయమూర్తి రాంగోపాల్ హాజరై మాట్లాడారు. వర్తమాన న్యాయ విద్యార్థులకు ఇలాంటి మూట్ కోర్టులు అవసరమన్నారు. న్యాయ వాద నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు మూట్ కోర్టు సరైన వేదిక అని అన్నారు. పోటీల్లో సుమారు 36 జట్లు పాల్గొనగా సాయికృష్ణ, కౌశిక్, యశ్వంత్ కుమార్‌రెడ్డి, మనీష్ చంద్రశేఖర్‌తో కూడిన జట్టు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి, అతిథులు, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు.. జగ్జీవన్‌రామ్

భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సమతావాది డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని అన్ని యూనివర్సిటీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశ ఉపప్రధానిగా, రక్షణ శాఖ మంత్రిగా, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ జయంతి వేడుకల్లో అధికారులు, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

– తిరుపతి సిటీ/తిరుపతి కల్చరల్/తిరుపతి అర్బన్/తిరుపతి గాంధీరోడ్డు/తిరుపతి తుడా/పాకాల/తిరుపతి రూరల్/తిరుపతి లీగల్



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్, అధికారులు



నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్



మహిళా వర్సిటీలో నివాళులర్పిస్తున్న వీసీ ఉమ







నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు, వేదిక్ వర్సిటీలో ..., నగరపాలక సంస్థ కార్యాలయంలో..., తిరుపతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో.. పేరూరు పంచాయతీ క్వార్టర్స్ వద్ద..

ఘనంగా భూమన జన్మదిన వేడుకలు



భూమన కరుణాకర రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న భూమన అభినయ్ రెడ్డి, పార్టీ శ్రేణులు

తిరుపతి మంగళం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరుపతి పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద శనివారం 14వ డివిజన్‌కు చెందిన పార్టీ నాయకుడు అనీల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డితో పాటు పార్టీ శ్రేణులు భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. తిరుపతి ఎమ్మెల్యేగా, టీటీడీ చైర్మన్‌గా తిరుపతి ప్రజలకు ఎనలేని సేవలందించిన గొప్ప నాయకుడు భూమన కరుణాకరరెడ్డి అని తన తనయుడు అభినయ్‌రెడ్డి కొనియాడారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తమ కుటుంబం నిత్యం ప్రజాసంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తామని చెప్పారు. తిరుపతి నగర ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పదవులు ఉన్నా లేకున్నా నిరంతరం శ్రమిస్తామని అభినయ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, డైరెక్టర్ కడపగుంట అమరనాథ్‌రెడ్డి, కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు, పార్టీ నాయకులు పెంచులయ్య, సాకం ప్రభాకర్, అజయ్‌కుమార్, నల్లాని బాబు, రాజేంద్ర, మార్కెట్ వంశీ, ఉదయ్‌వంశీ, షేక్ ఇమ్రాన్ బాష, దినేష్‌రాయల్, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, వెంకటేష్, పసుపులేటి సురేష్, రుద్రగోపి, సాయికుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి దోపిడీ బట్టబయలు

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి కూటమి ప్రభుత్వం చేస్తున్న బాగోతాలను వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి వీధి నాటకాలతో బట్టబయలు చేశారని ఆ పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచమంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చి.. ఇప్పుడు విద్యుత్ చార్జీలతో పాటు సర్ చార్జీల పేరుతో ప్రజలపై అధిక భారం మోపుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ అరాచకాలు, దోపిడీలను ఎండగడుతూ నిన్నటి రోజున తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో వీధి నాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించిన విషయం తెలిసిందేనన్నారు. అయితే వారి బాగోతాన్ని బట్టబయలు చేశారన్న ఆవేదనతో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వీధి నాటకాలు, డ్రామాలు వేశారంటూ హేళనగా మాట్లాడడం బాధాకరమన్నారు. కేవలం డిప్యూటీ మేయర్‌గా ఉండి 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లను వేసిన ఘనత అభినయ్‌రెడ్డిదేనన్నారు. గెలిచినప్పటి నుంచి తిరుపతిలో చిన్నపాటి అభివృద్ధి చేశావా? ఆరణిని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు ఉదయ్‌వంశీ, షేక్ ఇమ్రాన్‌బాషా, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లం రవిచంద్రారెడ్డి

గణిత అభ్యసనానికి వేద, అబాకస్‌లు అవసరం

తిరుపతి సిటీ: గణితశాస్త్ర అభ్యసనానికి వేదగణితం, అబాకస్‌లు ఎంతో అవసరమని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు అన్నారు. తిరుపతిలోని న్యూ బాలాజీ కాలనీలో ఆర్కే గ్రూప్ అఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, వీక్ష ది స్కూల్–ఆర్కే అబాకస్ విద్యాసంస్థల 13వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వేద గణితం, అబాకస్ ప్రాచీన భారతావని ప్రపంచానికి అందించిన గణితాస్త్రాలనీ, వేద గణితం అనేది సంఖ్యా గణనలను త్వరగా పరిష్కరించడానికి ఉపయోగించే 16 ప్రధాన సూత్రాలు, 13 ఉప సూత్రాల సమాహారం అన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రైవేట్ ఆన్ ఎయిడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాయసీమ జోన్ ప్రెసిడెంట్ విశ్వం స్కూల్స్ అధినేత డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, గీతం గ్రూప్ అఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, నలంద హైస్కూల్ అధినేత వెంకటరమణ రెడ్డి, ఎంఎంబీసీ స్కూల్స్ అధినేత భాస్కర రాజు, ఎస్వీయూ ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, సుమతీ రెడ్డి, రణధీర్, ఓంప్రకాష్, శ్రీరామ్ బాబు, ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న, అతిథులు, విద్యాసంస్థల ప్రతినిధులు

బైక్‌ను ఢీకొన్న కారు

– ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

చంద్రగిరి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరు తీవ్ర గాయాలపాలైన ఘటన మండల పరిధిలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... చిత్తూరుకు చెందిన దినేష్ వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో తిరుపతికి వస్తున్నాడు. అదే సమయంలో తమిళనాడులోని తిరునల్లారుకు చెందిన శ్రీనివాసన్ తన కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. పనపాకం వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న దినేష్ బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలోదినేష్ తీవ్రంగా గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



దెబ్బతిన్న ద్విచక్రవాహనం

జీఎంసీ టోల్గేట్ తనిఖీ

తిరుపతి క్రైమ్: తిరుమలలోని జీఎంసీ టోల్గేట్‌ను ఎస్పీ, టీటీడీ ఇన్‌చార్జ్ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ హర్షవర్ధన్ రాజు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. తిరుమలకి వెళ్తున్న వాహనాలకు ఇచ్చే టైమింగ్ టోకన్‌ను పరిశీలించారు. సెక్యూరిటీ స్కానింగ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తిరుమలకు వస్తున్న భక్తుల వాహనాలను తనిఖీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. తనిఖీ చేస్తున్న సమయంలో భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి ఆదేశించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

తిరుమల : తిరుమల ఘాట్ రోడ్డులో కారు అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. తిరుమల ట్రాఫిక్ పోలీసుల కథనం.. కర్ణాటకకు చెందిన భక్తులు కారులో తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుమల నుంచి అలిపిరికి మొదటి ఘాట్ రోడ్డుమీదుగా దిగుతుండగా స్థానిక వినాయక స్వామి ఆలయ సమీపంలో ఆకస్మాత్తుగా కారు ముందర టైరు పేలింది. కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న అర్చకుడికి గాయాలు కాగా, వాహనం ధ్వంసమైంది. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తొలగించారు. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.

సానుకూల దృక్పథంతో లక్ష్య సాధన

తిరుపతి ఎడ్యుకేషన్ : సానుకూల దృక్పథంతో ఎటువంటి లక్ష్యాన్నైనా సులువుగా సాధించవచ్చని కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. తిరుపతిలోని ఎడిఫై విద్యాసంస్థలో శనివారం కెరీర్ అవేర్‌నెస్ అండ్ లైఫ్ స్కిల్స్‌పై ఇంటర్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులకు అత్యున్నత శక్తి సామర్థ్యాలు ఉంటాయని, అయితే వీటిని చాలా మంది సద్వినియోగం చేసుకోకపోవడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నట్లు తెలిపారు. ఎడిఫై విద్యాసంస్థల డైరెక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ విద్యార్థి దశలో కొత్త విషయాలు తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలిగి ఉండాలని తెలిపారు. కౌటిల్య విద్యాసంస్థ సీనియర్ ఫ్యాకల్టీ ఎమ్ఎస్.రెడ్డి పలు అంశాలపై మాట్లాడారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్

తిరుచ్చిపై శ్రీనివాసుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులను కటాక్షించారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నోటీస్ బోర్డు

- శ్రీకోదండరామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శ్రీసీతాలక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీరాముల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 3 గంటకు శ్రీరామనవమి ఆస్థానం, రాత్రి 7 గంటలకు హనుమంత వాహనసేవ
- శ్రీదేవి కాంప్లెక్స్‌లోని టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకడమిక్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు
- సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 14వ రోజు కొనసాగింపు
- ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రవచన నిధి డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మచే శ్రీమద్రామాయణ ప్రవచనామృతం

నేటి నుంచి శ్రీరామనవమి వేడుకలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండ రామాలయంలో ఈనెల 6వ తేదీ ఆదివారం నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈనెల 7వ తేదీ సోమవారం ఉదయం శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు సీతారాముల కల్యాణం వైభవంగా జరగనుంది. రూ.1000 చెల్లించి ఇద్దరు దంపతులు స్వామివారి కల్యాణంలో పాల్గొనవచ్చు. ఈనెల 8వ తేదీ ఉదయం 8 గంటలకు తిరుపతిలోని శ్రీనరసింహతీర్థం నుంచి ఆలయ మర్యాదలతో తీర్థం తీసుకొచ్చి స్వామివారికి చతుర్దశ కలశ స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు శ్రీరామ పట్టాభిషేకం చేపడతారు. ఈనెల 9వ తేదీన సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం, ఆస్థానం, అలాగే 10వ తేదీ నుంచి 12 వరకు మూడు రోజుల పాటు ప్రతి రోజు రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు శ్రీరామచంద్ర పుష్కరిణిలో తెప్పోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి.

నేడు స్థానికులకు శ్రీవారి దర్శన టోకెన్ల జారీ

తిరుమల: తిరుమల, తిరుపతి స్థానికుల కోటా దర్శనంలో భాగంగా ఆదివారం స్థానికులకు దర్శన టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. ఈ మేరకు తిరుపతి స్థానికులకు మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలోను, తిరుమల స్థానికులకు బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్లో ఉదయం 5 గంటల నుంచి శ్రీవారి దర్శన టోకెన్లు జారీ చేయనున్నారు. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన స్థానిక భక్తులు ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందాల్సి ఉంది.

గంగమ్మ ఆలయానికి విరాళం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తిరుపతికి చెందిన శ్రీసాయిరాం టిఫెన్ సెంటర్ అధినేత కె.నీలకంఠరెడ్డి శనివారం రూ.1,11,116 విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని ఆలయ ఈఓ జయకుమార్‌కు దాతలు అందజేశారు. ఈ విరాళం సొమ్మును అమ్మవారి ఆలయ నిర్మాణానికి వినియోగించాలని వారు కోరారు.



గంగమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు నీలకంఠరెడ్డి

వడదెబ్బపై అవగాహన

భాకరాపేట : వేసవి ఎండలు ఎక్కువగా కాస్తున్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డెమో అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని చిట్టెచెర్ల పంచాయతీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ కృష్ణమ్మ, మంజులత గిరిజ, సంఘమిత్ర, ఆశావర్కర్, స్వయం సహాయక మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

శాస్త్రోక్తకంగా అంకురార్పణ

చంద్రగిరి: చంద్రగిరిలో వెలసిన శ్రీకోదండ రామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం ఆలయంలో అంకురార్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను చేపట్టారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు.

అకౌంట్‌లో డబ్బు మాయం

తిరుపతి క్రైమ్: నగరానికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో మోసపోయిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాయల్ నగర్‌లో నివాసం ఉంటున్న తేజోవతి అనే మహిళ అకౌంట్లో రూ.6000 నగదు కనిపించకుండా పోవడంతో గూగుల్ పేలో సెర్చ్ చేసింది. వెంటనే బాధితురాలు అకౌంట్ నుంచి రూ.39 వేలు రెండుసార్లు విత్‌డ్రా చేశారు. సైబర్ నేరగాళ్ల బారిన పడినట్లుగా గుర్తించిన మహిళ వెంటనే 1930కి కాల్ చేసి జరిగిన విషయాన్ని తెలిపింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం రూ.79 వేలు నగదు పోయినట్లుగా ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

గోవింద నామం.. సుమధురం



ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో భక్తిభావాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో శనివారం స్థానిక భజన మండలి కళాకారులు నగర వీధుల్లో చేపట్టిన గోవిందనామ సంకీర్తనతో తిరునగరం మార్మోగింది. ఉదయం 5 గంటలకు భజన మండలి కళాకారులు తిరునామాలు ధరించి సంప్రదాయ వస్త్రధారణతో నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం కళాకారులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. - తిరుపతి కల్చరల్

మానవీయత చాటిన సాంస్కృతిక ప్రదర్శన

తిరుపతి కల్చరల్: కచ్చపి ఆడిటోరియంలో స్ప్రింగ్‌డేల్ పబ్లిక్ స్కూల్ 17వ వార్షికోత్సవం వేడుకల్లో భాగంగా శనివారం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తిని, ఆధ్యాత్మికతను, మానవీయ విలువలను చాటాయి. చిన్నారుల నృత్యాలు అబ్బుర పరిచాయి. తల్లిదండ్రులకు పిల్లల పట్ల బాధ్యతలను, పిల్లల పట్ల అమ్మ చూపే ఆప్యాయత, అనురాగం అంశాలతో కూడిన నృత్యాలు, వ్యోమగాములుగా, అంతరిక్ష యాత్ర, సరస్వతీదేవిని ప్రత్యక్షం చేసే సన్నివేశాలు ఆకర్షించాయి. మరాఠీ వీరుడు మొగల్ సామ్రాజ్యాన్ని ఆవిష్కరిస్తూ చేసిన విన్యాసాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఈ సందర్భంగా పాఠశాల అధినేత కేఎస్ వాసు మాట్లాడుతూ తమ పాఠశాల పూర్వ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కేఆర్ అనురాధ గోపాల్, హెఎం ప్రమీల కృష్ణన్, ఏఈఓ చంద్రశేఖర్, పీఆర్ఓ సాంబశివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్యంతో దేశభక్తిని చాటుతున్న చిన్నారులు